క్లుప్తంగా

విడిపోయిన భార్యపై దాడి

తాడికొండ: విభేదాలతో విడిపోయిన ఓ భర్త, తన భార్యపై దాడిచేసిన ఘటన తాడికొండ మండలం మోతడకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఎ కొండూరు మండలం, కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన బరోతు థావా అదే ఊరికి చెందిన రూపను 15 ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం.మనస్పర్థల కారణంగా ఇరువురూ ఎనిమిది నెలల క్రితం విడిపోయారు. కాగా గురువారం మోతడకలో బంధువుల వివాహానికి రూప వచ్చింది. ఆమె నిద్రిస్తున్న సమయంలో భర్త పచ్చడి బండతో తలపై దాడి చేశాడు. అప్రమత్తమైన స్థానికులు రూపను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

నల్లచెరువు పాఠశాలలో ఉర్దూ డీఐ తనిఖీలు



గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువులోని నగర పాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో సాధించిన మార్కులను ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ప్రగతి పత్రాలను త్వరితగతిన రూపొందించాలని సూచించారు. అదే విధంగా వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా, ప్రభుత్వ సూచనల మేరకు తప్పనిసరిగా రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ మోగించి, మంచి నీరు తాగే విధంగా చూడాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల నమోదు కోసం చర్యలు చేపట్టాలని కోరారు.

బొంతల వెంకటేశ్వర్లు కృషి మరువలేనిది



నెహ్రూనగర్: రజకుల సమస్యల పరిష్కారంలో బొంతల వెంకటేశ్వర్లు చేసిన కృషి మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజకజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అరండల్‌పేటలో వెంకటేశ్వర్లు ఐదో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి రజకులను చైతన్యం చేయడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ జాతీయ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, బీసీ సంఘ నాయకులు శివయ్య, ఉమా మహేశ్వరరావు, రమాదేవి, సాంబయ్య పాల్గొన్నారు.

గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా డాక్టర్ అందెకోటి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు గురువారం విధుల్లో చేరారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను డిప్యూటేషన్‌పై ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ చేసింది. డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రెడ్డిగూడెంకు చెందిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు 2005లో గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సూపర్ స్పెషాలిటీ పీజీని యశోదలో 2016లో పూర్తిచేశారు. వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2021లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. 2023 డిసెంబరులో అనంతపురం బదిలీ అయిన ఆయన్ను ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్ల కోసం గుంటూరుకు బదిలీ చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు వివరాల మేరకు..... ప్రత్తిపాడు మండలం తుమ్మల పాలెం పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామానికి చెందిన బొడ్డు నరేష్ బోయపాలెంలో మద్యం విక్రయించేందుకు వెళుతూ, ఆటో కోసం మెయిన్ రోడ్డుపై వేచి ఉన్నాడు. పక్కా సమాచారం అందడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. అతని వద్ద అక్రమంగా 180 ఎం.ఎల్. పది మద్యం బాటిళ్లను గుర్తించారు. ఈ మేరకు అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

కొండంత అభిమానం... పూల వర్షంతో స్వాగతం

- మురుగుడు లావణ్య ప్రచారానికి జన నీరాజనం
- ఐదేళ్లలో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపిస్తానంటూ హామీ
- ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలంటూ అభ్యర్థన
- తాడేపల్లి గ్రామీణంలో కోలాహలం... వైఎస్సార్‌సీపీ ప్రచారం



రోడ్‌షోలో మాట్లాడుతున్న మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని పాతూరు, గుండిమెడ ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య,, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, పార్టీ చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి, ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డిలతో కలసి గురువారం సాయంత్రం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షో కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుంచి అనూహ్య స్పందన లభించింది. పాతూరులో ప్రజలు లావణ్య ప్రచారానికి బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా పూలవర్షం కురిపించారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతించారు. గుండిమెడ, చిర్రావూరులో ఇదే తరహా స్వాగతం లభించింది.

జన్మభూమి కమిటీలేం చేశాయో గుర్తు చేసుకోండి

ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య, గంజి చిరంజీవి, కాండ్రు కమల ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పాతూరు, గుండిమెడ, చిర్రావూరు ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరిగింది? పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఎలా అందేవి? ఆనాటి జన్మభూమి కమిటీ సభ్యులు ఎలా వ్యవహరించారో ప్రజలందరూ గుర్తు చేసుకుంటే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎందుకు అవసరమో తెలుస్తుందని వారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లోని పేద ప్రజల జీవితాల్లో మేలిమి మార్పు రావాలంటే ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు ఇతర అవసరాలను మన ఇంటివద్దకే అందించారని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థ తో పాలనను ప్రజల చెంతకు చేర్చిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందన్నారు. మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయించారని, ఎన్నడూ చోటుచేసుకోని అభివృద్ధి నియోజకవర్గంలో జరిగిందని వారు తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్కే ఎంతో చేశారు

వ్యవసాయం చేసేవారు ఎక్కువగా ఉండడంతో ఒక రైతుబిడ్డగా ఎమ్మెల్యే ఆర్కే వారి కష్టాలు తెలుసుకుని డొంక రోడ్లు నిర్మించారని, నూతక్కి నుంచి కుంచనపల్లి జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్ నిర్మించారని,ఇలా చెప్పుకుంటూ పోతే ఎమ్మెల్యే ఆర్కే నియోజకవర్గానికి ఎంతో చేశారని మురుగుడు లావణ్య అన్నారు. పాతూరు, గుండిమెడ చిర్రావూరులో డ్రైన్లు, సీసీ రోడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రానున్న కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాతూరు నుంచి మంగళగిరి నియోజకవర్గం శివారు వరకు పంట పొలాల్లో మురుగునీటి సమస్యకు శాస్వత పరిష్కారాన్ని ఐదేళ్లలో చూపిస్తానని హామీ ఇచ్చారు. తనతో పాటు గుంటూరు పార్లమెంట్ నుంచి కిలారు వెంకట రోశయ్య పోటీ చేస్తున్నారని, ప్రజలు ఆదరించి తమ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. అంతకుముందు పాతూరు, గుండిమెడ, చిర్రావూరు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, ఎస్సీ సెల్ రూరల్ అధ్యక్షులు సంకురు మరియబాబు, మాజీ సర్పంచ్ సంకురు మేరిరాణి, మాజీ ఎంపీటీసీ రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, నామతోటి కోటేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, గుండిమెడ అర్జునరావు, జట్టి కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు మేకల సాంబశివరావు, కాశీనీడు బాజీ గంగాధర్, నారంశెట్టి చిన వెంకటేశ్వరరావు (బాబు), బోయిన కోటేశ్వరరావు, వీరిశెట్టి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి..అత్యధిక మెజార్టీ అందించండి

మంగళగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య



ఎన్నికల ప్రచారంలో స్థానికులతో మురుగుడు లావణ్య

మంగళగిరి : అందరికీ అందుబాటులో ఉంటా..సమస్యలు వింటా..వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తా..ఆశీర్వదించండి, అత్యధిక మెజార్టీని అందించండంటూ మంగళగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య ప్రజలను అభ్యర్థించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ ఎన్నో పథకాలను అమలు చేశారని, అవి కొనసాగాలంటే మరోసారి ఆయనను ఎన్నుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. నగరంలోని 23వ వార్డులో గురువారం మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవిలతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు మురుగుడు లావణ్యకు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చదువుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడేలా సంకల్పంతో ముందడుగు వేస్తున్నారన్నారు. ఆయన ఆశయానికి ప్రజలు తమవంతుగా ఓట్ల రూపంలో మద్దతునివ్వాలని లావణ్య కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మురుగుడు సత్యం, ఎండీ ఇక్బాల్ అహ్మద్, మొహమ్మద్ రఫీ అలీభాషాఖాన్, అష్రాఫ్ ఖాన్, షేక్ సుభానీ, సుంకర రఘుపతిరావు, కుంచాల కిషోర్, తిరుమలశెట్టి సురేంద్ర, మున్నంగి రామిరెడ్డి, రంగిశెట్టి పెద్దబ్బాయి, బోళ్ల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లావణ్య నామినేషన్‌కు భారీగా తరలిరండి

తాడేపల్లిరూరల్ : ఎమ్మె ల్యే ఆర్కే అభినందనలతో వైఎస్సార్‌సీపీ మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మురుగుడు లావణ్య నామినేషన్‌కు భారీగా తరలిరావాలంటూ తాడేపల్లి పట్టణ, గ్రామీణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య ఓ ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మంగళగిరి పట్టణ పరిధి సీతారామ కోవెల నుంచి సాగే భారీ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు.

నామినేషన్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న తుళ్ళూరు డీఎస్పీ అశోక్ బాబు

తాడికొండ: గురువారం నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియకు పోలీసులు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేయనున్నారన్న సమాచారం మేరకు అన్ని ప్రధాన రహదారుల వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వివాదాలకు తావు లేకుండా 200 మీటర్ల దూరంలోనే నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల అనుచరులను నిలిపివేయనున్నట్లు తుళ్ళూరు డీఎస్పీ ఈ ఈశోక్ బాబు తెలిపారు. నామినేషన్‌కు సంబంధించి అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద క్రమశిక్షణా చర్యలు చేపడతామన్నారు.

జనసేన, టీడీపీకి భారీ షాక్

- వైఎస్సార్‌సీపీలోకి చేరిక
- కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- మన బీసీ అభ్యర్థికే మా మద్దతంటూ నినాదాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థిని లావణ్య

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన క్యాడర్ లో నిన్న మొన్నటివరకు నెలకొన్న అసంతృప్తి సెగలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. నామినేషన్ వేసేందుకే రాని నాయకుడు పొరపాటున గెలిస్తే ప్రజల సమస్యలనేం పట్టించుకుంటాడంటూ స్వయంగా ఆ పార్టీ శ్రేణుల్లోనే చర్చ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో వీళ్లతో లాభం లేదంటూ టీడీపీ, జనసేనకు చెందిన బడుగు, బలహీన వర్గాలు వైఎస్సార్ సీపీ గూటికి చేరుతున్నారు. తాజాగా గురువారం కార్పొరేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన రెల్లి సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య సమక్షంలో చేరారు.

సైన్యంగా ఉంటాం...విజయాన్నందిస్తాం

ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ..గత ఎన్నికల్లో పూర్తి స్థాయిలో టిడిపి గెలుపుకోసం పనిచేశామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ లాంటి పేదల ఇంటిముందుకే పాలనాఫలాలు అందుతున్నాయన్నారు. సామాన్య ప్రజలకు అంతకన్నా ఇంకేం అవసరముంటుందన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. ఇలాంటి నాయకుని తిరిగి ఎన్నుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యకు సైన్యంగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ముక్తకంఠంతో పలికారు.పార్టీలో చేరిన వారిలో కాసాల మురళి, పెరికల రమేష్, ఇల్లపు సూర్యతేజ కుమార్, కొమ్మర ఉమాశంకర్, కోన కాంచన, కాసాల లీల, వేముల కోటేశ్వరి, ఇల్లపు గాయత్రి, పఠాన్ షఫీ, జాఫర్ బేగ్, పఠాన్ గౌస్, షేక్ గౌస్, షేక్ వలి, షేక్ బాజీ, మన్సూర్ బేగ్ ఉన్నారు.

ఫ్యాన్ కే పట్టం కడదాం

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా సమన్వయకర్త ఈదుల మూడి డేవిడ్ రాజు మాట్లాడుతూ ఏ అభ్యర్థికైనా నామినేషన్ ప్రక్రియ అనేది కీలకమైనది. అలాంటి ముఖ్యమైన ఘట్టానికి రాకుండా ఏసీ గదుల్లో కూర్చొని అనుచరులతో నామినేషన్ వేయించిన లోకేశ్..పొరపాటున గెలిస్తే ప్రజల సమస్యలనేం పట్టించుకుంటాడంటూ విమర్శించారు. మంగళగిరి వదిలేసి వలస పక్షిలా తిరిగే లోకేశ్ ను గెలిపిస్తే ఇక్కడ వున్న నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అగత్యం దాపురిస్తుందన్నారు. గత ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వచ్చిన నారా లోకేశ్.. బీసీ మహిళ తన ప్రత్యర్థిగా పోటీ చేస్తోందనే చులకన భావనతో వ్యవహరిస్తూ నామినేషన్‌కు రాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన దగ్గర నుంచి మురుగుడు లావణ్య అహర్నిశలు ఎలా శ్రమిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. లావణ్యకు పట్టం కడితే నేరుగా ఆమె దగ్గరకు వెళ్లి కష్టాలు చెప్పుకోవచ్చని, అదే లోకేశ్ అయితే తనను కలవడానికి వచ్చేవారి స్తోమత చూసి అనుమతిస్తారన్నారు. వీటిని బేరీజు చేసుకొని పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య,, ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్యల వెంట నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాచర్ల అబ్బు, దర్శి విజయశ్రీ, ఎండీ గోరే, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బు, షేక్ సుభాని, కుర్రిబర్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో 14...తాడికొండలో 1

ప్రశాంతంగా తొలిరోజు నామినేషన్ల పర్వం



లోకేశ్ తరపున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణికి అందజేస్తున్న కూటమి నేతలు

మంగళగిరి, తాడికొండ: తొలిరోజు నామినేషన్ల పర్వం ప్రశాంతంగా సాగింది. అటు మంగళగిరి నియోజకవర్గంలో 14 నామినేషన్లు వేయగా, తాడికొండలో కేవలం 'ఒక్కరు మాత్రమే నామపత్రాలను దాఖలు చేశారు. మంగళగిరి నియోజకవర్గం విషయానికి వస్తే...మొదటిరోజు 10 మంది అభ్యర్థులు 14 నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారిణి రాజకుమారి తెలిపారు. టీడీపీ అభ్యర్థి నారా లోకేష్ తరపున ఎన్ అబద్దయ్య, మైనర్‌బాబు నామపత్రాలు సమర్పించారు. అలాగే భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బోడె రామచంద్ర యాదవ్, నవతరం పార్టీ అభ్యర్థి రావు సుబ్రమణ్యం, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎస్‌కే జలీల్, జై భీమ్ పార్టీ అభ్యర్థి జడ శ్రావణ్‌కుమార్, తెలుగు రాజాధికార సమితి పార్టీ తరపున జంజనం కోటేశ్వరరావు లు నామినేషన్లు వేసినట్లు ఆమె తెలిపారు. స్వతంత్రులుగా దానబోయిన వెంకట శివాజీ, బండ్ల భిక్షమయ్య, నైనాల లావణ్య, జంజనం పద్మ నామపత్రాలు అందించారని రిటర్నింగ్ అధికారిణి రాజకుమారి వివరించారు.

సాగర్ జలాలతో నిండు కుండలా..



సాగర్ జలాలతో నిండుకుండను తలపిస్తోన్న ఫిరంగిపురం చెరువు.

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లోకి సాగర్ జలాలు చేరుతున్నాయి. దీంతో మండు వేసవిలోనూ తటాకాలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. రేపూడిలో చెరువుకు సాగర్ జలాలను తరలిస్తోన్న తీరును గ్రామీణ నీటిపారుదల శాఖ సహాయక ఇంజినీర్ (ఏఈ) శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఫిరంగిపురం. వేమవరం, కండ్రిక, మేరికపూడి, మునగపాడు గ్రామాల్లోని చెరువులను పూర్తి స్థాయిలో సాగర్ జలాలతో నింపామన్నారు. రెండు రోజుల్లో అన్ని గ్రామాల చెరువులకు సాగర్ జలాలను పంపిస్తామన్నారు. దీనిద్వారా మూడు నెలలకు సరిపడా తాగునీటి అవసరాలకు ఎలాంటి ధోకా ఉండబోదని చెప్పారు.

నిరంతరం ఫాగింగ్ చేపట్టాల్సిందే

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్



ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లిరూరల్ : నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ దోమల నిర్మూలనకు ఫాగింగ్ ప్రక్రియ నిరంతరం చేపట్టడంతో పాటు శానిటేషన్ పై పూర్తి దృష్టి సారించాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు. ఎక్కడ నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత ప్రాంతాల్లో విధులు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్పొరేషన్ సమావేశ మందిరంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో ఆయన విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛత సాకారం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని, నగరంలోని అన్ని రహదారులు, డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. నగరంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త గురించి ప్రజల్లో అవగాహన కల్పించి, నగర పరిశుభ్రత, పరిరక్షణలో వారిని భాగస్వాములను చేయాలన్నారు. సచివాలయాల పరిధిలోని ఖాళీ స్థలాల గురించి ఆయా యజమానులకు నోటీసులు జారీచేసి జంగిల్ క్లియరెన్స్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో సమస్యలెదురైతే కార్పొరేషన్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ఫార్మాసిస్ట్‌లది కీలక పాత్ర

గుంటూరు రూరల్: ఆరోగ్య ఫార్మా పరిశ్రమల రంగాల్లో ఫార్మాశిస్ట్‌లది కీలక పాత్రని నాట్కో ఫార్మా లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ డాక్టర్ పి.రంజిత్‌కుమార్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మశీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో కేరీర్ అవకాశాల అన్వేషణ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ప్రపంచంలోని అత్యంత పోటీతత్వ, డైనమిక్ రంగాల్లో ఒకటని తెలిపారు. ఫార్మశీ డైనమిక్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్ అని తెలిపారు. ఈ రంగంలో ప్రతి స్థాయిలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ తాజా ఫార్మశీ గ్రాడ్యుయేట్‌లు కెరీర్ మార్గం విభిన్నంగా అన్వేషించాలన్నారు. కళాశాల అధ్యాపకులు తదితరులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.

కొనసాగుతోన్న వలంటీర్ల రాజీనామాలు

సీఎం జగన్ పై దాడిని ఖండిస్తూ.



రాజీనామపత్రాలను కార్యదర్శి వెంకటేశ్వరరావుకు అందజేస్తున్న వలంటీర్లు

ఫిరంగిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై ఇటీవల జరిగిన దాడికి వలంటీర్లు నిరశన తెలిపారు. ఈ ఘటన బాధాకరమంటూ ముఖ్యమంత్రికి మద్దతుగా మండలంలోని నుదురుపాడు గ్రామానికి చెందిన 18 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. కార్యదర్శి వెంకటేశ్వరరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు.

నిడుముక్కల సచివాలయంలో ఐదుగురు వలంటీర్లు ..

తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కల సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పిస్తే, దాన్ని ప్రతిపక్షం అడ్డుకుని ప్రజలను తమనుంచి దూరం చేసిందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని, జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించి తిరిగి విధుల్లో చేరతామని వారు స్పష్టం చేశారు.



కార్యదర్శికి రాజీనామా సమర్పిస్తున్న వలంటీర్లు

అగ్నిప్రమాదాల నుంచి రక్షణపై మాక్‌డ్రిల్



స్టెమ్ స్కూల్లో ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలను నివారించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందాల్సిన విధానాలపై శాఖాధికారులు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా సహాయ అగ్నిమాపక శాఖాధికారి కె.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు-1 సిబ్బంది పాఠశాల ప్రాంగణంలో ప్రమాదాలను నివారించే పద్ధతులను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. ప్రమాదాలు నివారించే మార్గాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. .

భాష్యం స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ కాలనీలోని భాష్యం స్కూల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలను నివారించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందాల్సిన విధానాలపై ప్రయోగాత్మకంగా విద్యార్థులకు చూపించారు. గుంటూరు-2 స్టేషన్ అగ్నిమాపక శాఖాధికారి పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం...జల విహార తెప్పోత్సవం



గంగాపూజ కార్యక్రమం

తాడేపల్లిరూరల్ : విజయవాడ ఇంద్రకీలాద్రి ఉపాలయమైన సీతానగరం శ్రీమద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సీతారాములకు జల విహార తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేవస్థాన కార్య నిర్వహణాధికారి కేఎస్ రామారావు గంగాపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థాన అర్చకులు, సిబ్బంది, ఈఈ ఎల్ రమ, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com